# మాత



డా॥ వి. ఆర్. రాసాని.

అది కార్తీకమాసం.

ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో వచ్చే రెండో మంగళవారంనాడు, ఆ ఊరి గ్రామదేవత మాతమ్మ విగ్రహందగ్గర కోడిపుంజును కోసుకురావడం మాతంగి వాళ్ళ వంశాచారం.

అందుకే, ఒక గంపలో కాళ్ళు కట్టివేసిన కోడిపుంజును, దానిగొంతు కోయడానికి ఒక నురకత్తి, పసుపుకుంకుమల డబ్బా, కాయకర్పూరం వంటి పూజద్రవ్యాలు, నూనెగిన్నె, ముగ్గు చిప్ప పెట్టుకొని, ఆ గంపను నెత్తిన పెట్టుకొని, మరో చెత్తో ఆవుపేడను తీసుకొని బయలుదేరింది మాతంగి.

మాతమ్మగుడి ఆ గ్రామానికి ఉత్తరాన అర్థమైలు దూరంలో వుంది. ఆదారిలోనే ఎదురయ్యాడు ఆమె ఆరాధించే జయరాముడు. పెళ్ళి అంటూ చేసుకుంటే ఆతన్నే చేసుకోవాలన్న కోరిక ఆమెది. జయరాముడూ ఆమెను ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించాడు.

"మాట ప్రకారం వచ్చినావు. చేతిలో పేడ, నెత్తిన గంప ఏంది?" చూడగానే ప్రశ్నించాడు.

"మాతమ్మగుడి కాడికిలే, కోన్ని కోసుకోని రావాల. మాయప్పసెప్పినాడు." చిరునవ్వుతో కొంటెగా చూస్తూ అంది మాతంగి.

"నీసేతి చియ్యతినే యోగం నాకు లేనట్టుందమ్మ మాతా?" సీరియస్‌గా ముఖంపెట్టి అన్నాడు జయరాముడు.

"ఎందుకనీ!"

"మాపెద్దోళ్ళు వప్పుకోలేదమ్మ!"

ఆ మాటతో నిప్పులో పడ్డ ఉప్పులా పైకిలేచింది మాతంగి.

"నీసిగ్గుజిదమా! యీమాట సెప్పేదానికే ఇంతదూరం వస్తివామొగోడా? ఆమాటనేకి సిగ్గులే"

"యేంజేసేదమ్మ. వోళ్ళనూ నొప్పించలేను. నిన్నూ కాదనలేను. నూనెగానిగెలో గింజ మాదిరో నలిగి పోతా వుండాననుకో"



"ఎందుకనీ!" గద్దించినట్లడిగింది.

"మీరేమో ఉప్పతోలోళ్ళు. మేమేమొ మట్టిజాతోళ్ళం. అందుకే పెద్దోళ్ళు వద్దంటావుండారమ్మీ."

తలవంచుకుని తన అసహాయతను వ్యక్తంచేశాడు. ఆ మాటతో మాతమ్మ హృదయం ముక్కలైపోయింది.

మాతంగికి బుద్ధి తెలిసివచ్చినప్పటినుంచీ, తనకంటే సంవత్సరం పెద్దవాడయిన జయరాముడే నామొగుడనుకుంది. అతనూ మాతంగే నాపెళ్ళాం అనుకున్నాడు. అలా అనుకోవడంవల్లనేమొగానీ పెద్దయ్యాక ప్రగాఢప్రణయంగా మారిపోయింది. రానురాను ఒకరిని విడిచి మరొకరు ఉండలేని పరిస్థితి ఏర్పడిపోయింది.

తీరా పెళ్ళి చేసుకోవాలనుకునే సమయాని' ఒకేకుల మైనా – ఉపతెగలు వాళ్ళకు అడ్డుగా నిలిచాయి.



ఇలా మాట్లాడుకుంటుండంగానే ఆమె స్నేహితురాలు త్రిపుర సుందరి అటువైపుగా వచ్చింది. ఆమెరాకతో అతను అక్కడినుండి వెళ్ళిపోయాడు.

"ఏమే ఏమంటా ఉండాడు నీ హీరో?"

ఆటపట్టించాలనుకొని అంది వెలుతున్న జయరాముడివైపు చూస్తూ. కానీ మాతంగి ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఉండి పోయింది. దాంతో ఆ విషయం అంతటితో మానేసి మాట మార్చింది త్రిపురసుందరి. "ఏమేమాతా! పొద్దన్నే.....గంపెత్తుకొని పోతుండావ్? యాడికి?" "యేంలేదే. ఈనెలలో మాయిల వేల్పు మాతమ్మ దగ్గిర కొన్ని గావిచ్చి రావడం మా ఆశారం. మా నాయన యాడికో పనిమీద బోతా నాకు సెప్పిపోయినాడు. అందుకని యిట్లోస్తి."

సమాధానం చెప్పింది మాతంగి.

"ఆ పొలిమేర దగ్గిరుండే మాతమ్మేగదా. నేనొస్తాపా. అన్నే మా బాయికాడ నాకూ కొంచెం పనుండాది."

ఆమెతోబాటు బయలు దేరింది త్రిపురసుందరి. మాతంగి ఆ ఊర్లోవున్న వడ్డెకులానికి చెందిన చెంచయ్య కూతురు. ఛామన ఛాయతో....గుండ్రటి ముఖంతో.... పొడుగాటి నొక్కులజుట్టుతో ఎంతో అందంగా వుంటుంది మాతంగి. ఆ సమయంలో తల స్నానం చేసి నూలు వస్త్రం కట్టుకోనున్నా..... అపరలక్ష్మిలావుంది.

అదే ఊర్లో వున్న ధనవంతుడు, భూస్వామి, ఆ గ్రామానికి మకుటంలేని మహారాజు అయిన రంగనాయుడి కూతురు త్రిపుర సుందరి. సన్నని శరీర ఛాయతో.... ఒకమోస్తరు అందంగలది త్రిపురసుందరి.

వారిద్దరికీ చిన్నప్పట్నుంచీ మంచి స్నేహం. ఇద్దరూ సమవయస్కులే. కాయకష్టంచేసి బతికే మాతంగి పేదరికంగానీ, సుఖసౌఖ్యాలను అనుభవించేసే త్రిపురసుందరి సిరిసం పదలు గానీ ఆమె నలుపురంగు గానీ వారి స్నేహానికి అడ్డుకాలేదు.

వారికి ఒకరంటే మరొకరికి ప్రేమ! అభిమానం!

మాతంగి త్రిపురసుందరిలు చిన్నప్పుడు సంవత్సరంపాటు ఎలిమెంటరీ స్కూల్లో కలిసి చదువుకున్నారు.

మాతంగి త్రిపురసుందరి ఇంటికిగానీ, త్రిపురసుందరి మాతంగి ఇంటికిగానీ సామాన్యం గా పోరు. ఊరిముందరనో, పొలాలలోనో అప్పుడప్పుడూ పలుకరించు కుంటూ వుంటారు.

కొద్దిక్షణాల్లోనే యిద్దరూ కబుర్లాడుకుంటూ మాతమ్మగుడిని చేరుకున్నారు.

అక్కడ ఒకరాతిపైన గంపను దించి పెట్టింది మాతంగి. "త్రిపరా! నువ్వు యిక్కట గుంటిపైన కూసోని మాటాడతావుండు. వొగ్గివిడిలో.....అలికి ముగ్గుపెట్టి, దీపం ముట్టిచ్చి, కొన్నికోసేస్తా...."

అని మాతంగి..... ఆగుడిముందర..... ఒకచోట అలికి.....ముగ్గువేయడంలో మునిగి పోయింది.




ప్రత్యేకంగా అక్కడ గుడి అంటూ ఏమీలేదు. మూరెడెత్తు రాతి తిన్నెపైన... నగ్నంగా వెల్లికలా, కాళ్ళుబారసాచి పడుకున్నట్లున్న తలలేని ఒక స్త్రీ విగ్రహం.... దానిమెడ వైపున సుమారు పది పదిహేను అడుగుల ఎత్తువరకు పెరిగివున్న ఒక పెద్ద చంద్రచెట్టు, దానికి నీడనిస్తూ.....పందిరిలా కనిపిస్తోంది. అదే మాతమ్మగుడి, యింకా అక్కడ విగ్రహానికి కుడివైపున ఒక చిన్న రాతి గూడు, అందులో ఒక మట్టి దీపపు పెమ్మె వుంది. ఆ విగ్రహానికి చుట్టూ రకరకాల సీతాఫలం చెట్లు, చిగరచెట్లు, రెండు పొనగచెట్లు ఉన్నాయి.

ఆ విగ్రహానికి తల లేక పోవడానికి గల కారణం తెలిపే ఒక కథ కూడా జనవ్యవహారంలో వుంది. దాన్ని గురించి త్రిపురసుందరికి కూడా చూచాయగా తెలుసు. ఇంకా వివరంగా తెలుసుకోవాలనుకొని "వసేమాతా! ఈ గంగమ్మ గురించి ఏదో కథ చెబుతావుంటారుగదా....యేందదీ?" అని కుతూహలంగా అంది.

ఒక్క క్షణం తలపక్కకు తిప్పి చూసి ఆ కథ చెప్పసాగింది మాతంగి.

"పూర్వం జమదగ్ని అనే వొకమునీస్పుడు చేసే యగ్గిణం కోసరం పతిరోజూ ఆయన భారియ్య రేణుకమ్మ....నదికి బొయ్యి తన పతివర్తతనంతో.....ఇనకతో కుండను చేసుకొని, అందులోనీళ్ళు ముంచుకొని తెస్తావుండిందంట. ఇట్లుంటే వొగదినము ఆ నదిలో ఇద్దరు గంధర్వులు, దేవుతులో ఆలుమొగులు తానవాడతా రతులాడతావుంటే, వొళ్ళను జూసిన రేణుకమ్మ మొనుసు ఆయప్పపైకి పోయి ఆమె పతివర్తతనం భంగమైపూడిసిందంట. ఆ మింద ఇంగ ఏంజేసినా ఉత్తలోసికున్న ఇనక కుండ కాలేదంట. ఇంక ఏమీ చేయలేక వట్టిచేతల్తో అయమ్మ ఇంటికొచ్చేసిందంట. ఇదంతా దివ్వెదిష్టితో జరిగింది తెలుసుకున్న ఆ మునీస్పుడు, తన నూరుమంది కొడుకుల్ని బిలిచి అయమ్మను నరికేయమంటాడంట. అయితే తల్లిని ఎవురయినా నరికేస్తారా..... అందుకే ఎవరూ ఆ పనిచేసేకి ముందుకు రాలేదంట. కడాకు అందరికంటే సిన్నోడు పరుసురాముడనే వోడు ముందుకొచ్చి అయమ్మకు ఓ దండం పెట్టి, చేతనుండే గండ్రగొడ్డిలితో ఆమె తల నరికేస్తాడంట. అప్పుడు ఆ తలబొయ్యి మాలపల్లెలో బడి అది వొళ్ళకుల దేవతగా, గంగమ్మగా, వొళ్ళ ఆడపడుచుగా పూజలందుకుంటావుందంట. అయితే ఆమె మొండెం మాత్రం.....కాయ కష్టంచేసి బతికే మావడ్డిగూడెంలో పడి అది మా వొళ్ళకు దేవతైపూడిసిందంట. అదీ అయమ్మ కథ"

ముగ్గువేయడం పూర్తిచేసి లేచి, ఆ విగ్రహం వైపు చేయి చూపిస్తూ చెప్పి కథ ముగించింది.

రాతి గుండుపైన కూర్చొని అటువైపే చూడసాగింది త్రిపురసుందరి. ఆ విగ్రహం యొక స్త్రీ అవయవభాగం పచ్చిగా కనిపిస్తోంది. "ఏమే మాతా! ఈయమ్మ కోరిన కోరికలు తీరుస్తుందంటారు నిజమేనా!" అడిగింది త్రిపురసుందరి.

"అవునే....శానా సత్తిమంతురాలని అందరూ చెప్పుకుంటారు."

"ఆహా! అయితే నువ్వేం కోరుకుంటావ్?'

త్రిపుర సుందరిప్రశ్నతో ఒక్కక్షణం మౌనంవహించింది మాతంగి. "ఆఁ....చెప్పు....నువ్వేంకోరుకుంటావు అని?' 'రెట్టించి అడిగింది.

"నీకు తెలీని కోరికలు నాకే ముంటాయే.'

దీగూట్లోవున్న దీపంలో వత్తి ఎగదోసి గిన్నెలోని నూనె అందులోపోస్తూ నిర్లిప్తంగా అంది మాతంగి.

"ఏందే వచ్చినప్పట్నుంచీ చూస్తావుండా.... దిగులుగా అదో మాదిరిగా వుండావు....అని లేచివచ్చి ఆమె భూజాల్ని స్పృశిస్తూ........ "నిజంచెప్పవే, ఏదో దాస్తున్నావ్?" అని ఆప్యాయంగా అడిగింది. "చెబితే..... బాధపడతావ్?

"నీబాధను నేను పంచుకోకూడదా?"

"మీరు మారాజులు, మేమూ......కూలీ జేస్తే కుండగాలే లేకుంటే ఎండగాలే - బాపతు. మాలాంటోళ్ళ బాధ పంచుకోను మీకేం కర్మ?' 'ఆ మాటతో త్రిపురసుందరి మనస్సు చివుక్కుమంది. "

"అప్పటికి నన్ను పరాయిదానిగానే సూస్తావుండావ్. అంతేనా?" చిరుకోపం చిందించింది.

"అట్లనిగాదే......"

ఆపైన ఏం చెప్పాలో అర్థంగాక.....ఆమాట ఆమె గొంతులో అలాగే నిలబడిపోయింది. దాంతో అగ్గిపెట్టె గీచి దీపంముట్టించడంలో మునిగిపోయింది.

"ఓ.......తెలిసిందిలే......నీప్రియుడి జయరాముడికీ నీకూ పెళ్లి గావాలని మొక్కుకుంటావా?"

ఉడికిస్తూ అంది త్రిపురసుందరి.

పెళ్ళిమాటెత్తుకునేసరికి క్షణకాలం మాతంగి బుగ్గలు సిగ్గుతో కెంపులయ్యాయి. అయినా ఆమె అంతరాంతరాల్లో దాగుండే బాధ తాలూకు ఛాయలు ఆమె ముఖంలో తొంగి చూశాయి. అందుకే......."మాయిద్దరికీ పెండ్లవుతుందంటావా?" అని నిరాశగా శూన్యంలోకి చూస్తూ అందిమాతంగి.

"ఎందుక్కాదు మీ పెళ్ళినేజేస్తాఆఁ........'

ధృడంగా అంది త్రిపురసుందరి.

"అది అంతసులభంగాదే"

"ఎందుకనీ?"

ప్రశ్నించింది త్రిపురసుందరి.

ఆమెమంచి తనానికీ ఆమె తనపట్ల చూపిస్తున్న అభిమానానికీ మాతంగి మనసు కృతజ్ఞతతో నిండిపోయింది.

"మాపెళ్ళి జరిగేట్టులేదని యిప్పుడే చెప్పిపోయినాడు అయప్ప". నిరాశగా




చెప్పింది.

"ఎందుకంట?"

"జయరాముడోళ్ళు మట్టితెగోళ్ళు, మేమేమో ఉప్పుజాతి వోళ్ళంగదా? అందుకని'

అసలు విషయం చెప్పింది.

"ఒకే కులంలో ఈతెగలు, జాతులూ యేందే"

అర్థంగాక అయోమయంగా అడిగింది త్రిపురసుందరి.

"వాళ్ళు మమ్మల్ని తక్కువగా చూస్తారే. మాలోళ్ళు మాదిగోళ్ళను జూసినట్ల మమ్మల్నీ జూస్తారు. అందుకే పెద్దోళ్ళు వప్పుకోలేదని జెప్పినాడు జయరాముడు."

ఆమాట వినేసరికి త్రిపురసుందరి గుండెలో కలుక్కుమంది.

"జయరాముడికి నే జెప్తాలే."

"ఏంజెప్తావో ఏమొలే...ఇంతకీ నా అదృష్టం బాగాలేదు."

నిట్టూర్చింది మాతంగి.

రాయలసీమ వడ్డెవాళ్ళలో ప్రధానంగా రెండు తెగలువున్నాయి. అందులో ఒకటి....చేలగట్లు వేయడం, బావులు తవ్వడం, మట్టిగోడలు పెట్టడం వంటి మట్టి పనులు చేసి బతికే తెగ మట్టివాళ్ళు. మరొకటి గాడిదలపైన ఉప్పుమూటలు, కొబ్బరితాళ్ళు వేసుకుని ఊరూరు తిరిగి వాటిని అమ్ముకొని బతికే ఉప్పుతెగోళ్ళు. ఈ ఉప్పుతెగ వాళ్ళను, మట్టి తెగవాళ్ళు దాదాపుగా అంటరాని వారిగానే చూస్తారు. ఈ రెండు తెగలమధ్య వివాహ సంబంధాలు వంటివి ఉండవు. చివరికి ఉప్పోడ్లోళ్ళ ఇళ్ళలో మట్టితెగ వాళ్ళు భోజనం చేయడం కూడా తక్కువగానే భావిస్తారు. ఇన్ని వైరుధ్యాలున్నా అందరూ ఒక చోటే జీవిస్తుంటారు. అయితే మిగిలిన కులాలవాళ్ళు మాత్రం ఈ రెండు తెగల వాళ్ళనూ ఒకే విధంగా భావిస్తారు.

అలాంటప్పుడు మాతంగి జయరాముల వివాహం ఎలా జరుగుతుంది? అదే దిగులు మాతంగికి. ప్రేమించుకున్నప్పుడు, కలిసి తిరిగినప్పుడు ఈ తెగలు అడ్డురాలేదు. ప్రస్తుతం ఆ దిగులుకంటే మరో దిగులు మాతంగిని పట్టుకుంది.

ఆకులంలో వివాహ వ్యవస్థకు అంతగా ప్రాధాన్యతలేదు. పెళ్ళి చేసుకున్న వ్యక్తి నచ్చకపోయినా, వేధిస్తున్నా, మరొకరిని పెళ్ళి చేసుకోవచ్చు. దాన్నెవ్వరూ పట్టించుకోరు పైగా అలాంటివారికి గౌరవం ఎక్కువ. అలా పన్నెండు మంది మగాళ్ళను పెళ్ళి చేసుకున్న యువతికి 'పట్టని బోయసాని'అని ఆ గూడానికి పట్టంకట్టి, ఆమెనే తమకుల పెద్దగా భావించుకుంటారు. ఆమె మాటకు ఆకులంలో మంచి చెలామణీ వుంటుంది. ఆమె కూలి చేయకపోయినా, అందరూ కలిసి కూలి చేసిన రోజున ఆమె కొక మనిషి కూలి ఉచితంగా యిచ్చేస్తారు. పండుగ పబ్బాల్లో, ఎప్పుడైనా వేటకొస్తే....ఒక భాగం ఆమెకు ఉచితంగా అందాల్సిందే. దీన్ని 'బోయసాని భాగం' 'రంగాసాని లోబం' అనీ అంటారు. ఆ ఊర్లో ప్రస్తుతం ఒక బోయసాని వుంది. ఆమెనందరూ 'రంగసాని' అని పిలుస్తారు. ఆమెకూ రంగనాయుడికీ ఎప్పట్నుంచో అక్రమ సంబంధం కూడా నడుస్తోంది. అవసర మైనప్పుడు వడ్డీ గూడెంలో నుంచీ ఆతనికి అమ్మాయిల్ని కూడా తార్చుతుం టుంది. పైగా ఆమెకు ఆ గ్రామ దేవత మాతమ్మ కూడా ఆవహిస్తుందని, అప్పుడ ప్పుడూ పూనకం వచ్చి ఊగిపోతుంటుంది. వాళ్ళకు ఇలాంటి మూఢాచారాలు చాలా వున్నాయి. వాటన్నింటిలోకి అతనికృష్టమైన మరో ఆచారం 'మాతమ్మ' ఆచారం.

ఆ గూడెంలో కొన్ని కుటుంబాల్లో తొలుత

పుట్టిన బిడ్డను మాతమ్మగా మార్చే ఆచారం వుంది. యుక్తవయసు వచ్చిన ఆడపిల్లను మాతమ్మకిచ్చి పెళ్ళిచేసి, ఆమె పేరుతో సమాజపరం చేస్తారు. దీన్నే ముద్దుగా 'బసివిని చేయడం', 'ముద్దరేసివదిలేయడం' అనీ అంటారు. అయితే ఈ ఆచారాన్ని మారుతున్న కాలంతో బాటు వాళ్ళు వదిలేయాలని ఎన్నోసార్లు అనుకున్నారు. కానీ ఎవరోఒకరు ఏదో విధంగా తమ స్వార్థం కోసం ఆ ఆచారాన్ని ఎలాగో ఓలాగు తిరిగి కొనసాగేటట్లు చేస్తున్నేవున్నారు. ప్రస్తుతం ఆజాడ్యం మాతంగిని తగులుకుంది.

కొద్దిరోజుల్లోనే మాతంగిని మాతమ్మను చేస్తారన్న వార్త ఆ గూడెంలో గుప్పుమంది. అందుకే ఆ గండం గడిచి, జయరామున్ని పెళ్ళిచేసుకోవాలనీ, తన కోర్కెలు తీర్చమనీ, అమాతమ్మను కోరుకోవడానికే అక్కడికి వచ్చింది మాతంగి. ఆమె మాతమ్మ వరప్రసాదంతో పుట్టిందనికూడా వాళ్లింటిళ్ళపాదీ నమ్ముతారు.

ఆ విషయాన్నే చెప్పింది మాతంగి.

"కొద్దిరోజుల్లో నన్ను మాతమ్మం జేస్తారు' కళ్ళనీళ్ళు నింపుకుంటూ అంది.

"అఁ.....నిన్నా?"

ఆశ్చర్యపోయింది త్రిపురసుందరి.

"ఎలాగయినా సరే? తన స్నేహితురాల్ని ఈ కష్టం నుంచీ తప్పించాలి" అనుకుంది.

ఇంతలో పూజ పూర్తిచేసి, కొబ్బరికాయ కొట్టి కర్పూరం వెలిగించింది మాతంగి.

"మొక్కవే, నీ కోరికా ఉఁడేరుతుంది. అమ్మకరుణిస్తుంది."

అంది తానూమొక్కుకుంటూ మాతంగి.

"మాతంగిని ఈ గండంనుంచీ తప్పించి, జయరాముడితో పెళ్ళి జరిగేట్టుగా చూడుతల్లీ.....అప్పుడు నిన్ను నమ్ముతా. అట్ట జరిగితే నీకు వంద కొబ్బరికాయలు కొడతా!'


మనసులోనే ప్రార్థించింది త్రిపురసుందరి.

ఆ తర్వాత కోడికాళ్ళు విప్పి, దానిరెక్కల్ని తన కుడికాలికింద తొక్కిపెట్టి, దాని తలను ఎడమచేతతో లాగి పట్టుకొని, కసకస దానిగొంతు కోసేసింది మాతంగి.

శరీరానికి, ప్రాణానికీ వున్నలంకె పుటుక్కున తెగిపోవడంతో కోడిపుంజు శరీరం, గిలగిల కొట్టుకుంటూ ఎగిరెగిరిపడుతోంది.

ఆతలను అక్కడే నేలపైన పెట్టి, ఎడమచేత్తో, చెంబులోని నీటిని ధారగాపోస్తూ, తనకుడి చేతి వ్రేళ్ళను ఆ తలపైన తాకిస్తూ....

"అమ్మా! సాఁవితల్లీ పలుకుపలుకు నీ సత్తెం




సూపించు. నాకోరిక తీర్చు. నన్ను నీకిచ్చి పెండ్లిజేసి, ముద్ద రేసివదిలేసే గండంనుంచీ తప్పించుతల్లీ. జయరాముడితో నా పెళ్ళి అయ్యేట్టుగా సూడుతల్లీ. సాఁవితల్లీ!" అంటూ పలికించడానికి ప్రయత్నించింది ఊహూ అది పలకలేదు.

ప్రాణం పోయే ముందు.....ఆతేమకు అది నోరు కదిలిస్తే.......కోరిక తీరుతుందని జానపదులు నమ్ముతారు. దాన్నే 'పలికించడం' అంటారు ఈతంతును జాతర్లలో పెద్దవాళ్ళు చేస్తుంటే చూసి గ్రహించి యిప్పుడు తనూ అలానే చేసింది మాతంగి. అలా ఎంత ప్రయత్నించినా అది పలుకలేదు. దాంతో మాతంగి గుండెలోనుంచీ దుఃఖం తన్నుకొచ్చింది. "సరే యింకో రకంగా ప్రయత్నిస్తా" అనుకుంటూ ఆ తలను తన రెండు చేతుల్లోకి తీసుకుంది మాతంగి.

ఆమె చర్యను వింతగా చూస్తోంది త్రిపురసుందరి. "అమ్మా! ఈ పెసాదం అందుకో. నీ యిల్లయిన ఈ సంద్రసెట్టులోనే నిలుపుకో. అట్ల నిలుపుకొని నా కోరిక తీర్చు.' ' అని కళ్ళకద్దుకొని దాన్ని ఆ చెట్లోకి ఎగురవేసింది. అది అక్కడక్కడా ఆగినట్లే ఆగి, మెల్లగా వచ్చి కిందపడిపోయింది. దాంతో మాతంగి ఆశలు అడియాశలయిపోయాయి. ఒక తట్టుకోలేక ఏడ్చేసింది. "త్రిపురా. యింక నన్నెవురూ రక్షించలేరే. యింగ నాగతంతే. ఎట్టరాసి పెట్టుంటే అట్టే అవతాది. ఆయమ్మ నా కట్టూరాసి పెట్టుండాది." ఆమె స్థితిని చూసి చలించి పోయింది త్రిపురసుందరి.

ఈసారి త్రిపురసుందరి, ఆ తెగిన కోడితలను తనకుడి చేతిలోకి తీసుకుని, దాన్ని ఆ చెట్లోకి విసరేసింది.

అది ఈసారి ఆ చెట్లోనే చిక్కుకుపోయింది. అలా ఆతలచెట్లోనే తగులుకుంటే కోరిన కోరిక నెరవేరుతుందని అక్కడి ప్రజల నమ్మకం. దాంతో కాస్త ధైర్యంగా ఇంటి ముఖం పట్టింది మాతంగి. త్రిపుర సుందరి అలాగే ఆ పక్కనేవున్న తమ వ్యవసాయపు బావి దగ్గరకు పోయింది.

☆☆☆

రంగనాయుడికి అమ్మాయిల పిచ్చి ఎక్కువ. ఆ గ్రామంలో ఆతని కెదురు లేదు గనుక, కంటికి నదురుగా కనిపించిన ఏ ఆడదాన్నీ వదలడు. అది ఆతని బలహీనత.

ఎలాపడిందో మాతంగి అతని కంట పడింది. తన కూతురితో మాటాడుతుంటే ....ఓరోజు చూశాడు. ఆమె అందం చూసి తట్టుకోలేక పోయాడు. ఆమె పొందుకోసం తహతహలాడాడు. అంతే రంగసానితో రాయబారాలు ప్రారంభించాడు. అయినా లాభంలేకపోయింది. దాంతో తనే రంగంలోకి దిగాడు. ఒకరోజు పొలంలో పనిచేస్తున్న మాతంగిని ఒంటరిగా చూసి చేయిపట్టుకొని బలాత్కరించబోయాడు. కానీ మాతంగి అతన్ని ఛీ కొట్టి, చెంపచెళ్ళుమనిపించి తప్పించుకొచ్చేసింది. ఆ సంఘటనను చాలా అవమానంగా భావించాడు నాయుడు. దాంతో ఆమెనెలాగయినా సరేపొందాలన్న పట్టుదల, ఆకాంక్ష, పంతం, పగ అన్నీ ఒక్కసారిగా విశ్వరూపం దాల్చాయి. ఇక అప్పట్నుంచీ అవకాశాలకోసం ఎదురుచూడసాగాడు. ఈ సంఘటన తనకే అవమానంగా భావించి మాతంగి ఎవ్వరికీ చెప్పుకోలేదు. వీలయినంత వరకూ త్రిపురసుందరితో కూడా మాట్లాడ్డం తగ్గించుకోసాగింది. అంతకు మించి రంగనాయుడి కంట పడకుండా జాగ్రత్తపడింది. చివరికి, మార్గాంతరంలేక నాయుడు బాగా ఆలోచించి పథకం వేశాడు అతను పథకంవేస్తే ......ద్రోణుడు పద్మవ్యూహం పన్నినట్టే. అతను ఎత్తువేస్తే, చదరంగంలో ఏకంగా రాజుకు 'చెక్' పెట్టినట్టే.

వెంటనే రంగసానిని రహస్యంగా తన గొడ్లచావిడికి పిలిపించుకొని తన పథకం గురించి చెప్పాడు.

"వసేరంగీ! చెంచయ్య వంశంలో

తరానికొకర్ని బసివిగా వొదిలే ఆచారముం డాది. ఈ తరంలోనే వదల్లా కదా?"

"అవును!"

"అందునా చెంచయ్యకు బిడ్డలు లేకంటే......మాతమ్మ వరంతోనే గదా వోడికి బిడ్డలు పుట్టినారు?"

"అది నిజమే!"

"అందుకేగదా! మాతంగికి ఆ దేవత పేరొచ్చేటిగా పెట్నారు."

"అవును. ఇదంతా ఎందుకడగతావున్నిట్టు"

అర్థంగాక అనుమానంగా అంది రంగసాని.

"నీయిత్తగిల్లా! బాగాయినుక నీకే అర్థంఅవుతుంది. నువ్వు దేవతొచ్చినట్టుగా ఊగిపో...."

"ఊగిపొయ్యి!"

"ఊగిపోంయ్య......ఊరికరిష్టం తగులుకునింది. దానిక్కారణం చెంచయ్య ఎవర్నీ బసివిగా జెయ్యలా. అందుకని ఆ అరిష్టం పోవాలంటే......మాతంగిని బసివిం జేయాల్సిందే. లేకంటే.....నాశనం చేసేస్తాను పల్లెని అని బెదిరించు."

"బెదిరిస్తే!"

"ఊరికిముందర గుడిసేసి మాతంగిని మాతమ్మకిచ్చి పెండ్లి జేసి ముద్దరేసివదిలేస్తారు."

"ఆఁ.....అర్థమైందిలే. ఆ తర్వాత నువ్వే శోభనం జరిపేస్తావు. అంతేగదా!"

"లేకంటే.....నామాట కాదని చెంపదెబ్బ కొడుతుండాలమ్మీ."

పళ్ళు పటపటాకొరికాడు.

"మరినాకేంది నాథం!"

ఆశగా అడిగింది రంగసాని.


"నీకు ఒకమంచి నేతచీరా, వాయిల్ రయికా తీసిస్తాలే పో."

"సరే! ఆమాటపైన నువ్వు నిలబడు. నీమాటనేనెగ్గిస్తా."

ఆనందంగా అంది రంగసాని.

కానీ మరో రెండు చెవులు వారికి తెలీకుండానే వారిమాటల్ని విన్నాయన్న సంగతి వాళ్ళు గమనించనేలేదు.

పథకం ప్రకారం ......ఆరోజు రాత్రి పూనకం వచ్చి ఊగిపోయింది రంగసాని. మాతంగిని బసివించేయండని ఆదేశించింది. కాదంటే.......భస్మంచేసేస్తా.....ఊరికి దూము తగిలేట్టుగా జేసేస్తా......అని నానా రకాలుగా బెదిరించేసింది. అమ్మవారే ఆమెవంట్లో కొచ్చి




చెప్పిందని మూఢంగా నమ్మిన ఆ గూడెం ప్రజలు మాతంగిని బసివిని చేయడానికే నిశ్చయించుకున్నారు. అనుకోవడమే ఆలశ్యం........ఊరిముందర కొత్తగా ఒకగుడిసె వెలసింది. నడివీధిలో ఆమెకు నలుగులు పెట్టి స్నానం చేయించారు.

ఆపల్లెలో ఎవర్నిబసివిని చేయాలన్నా, పసుపు కుంకుమలతో ఒక చీరను, రంగనాయుడి వంశీకులే పంపించడం అనూచానంగా వస్తున్న ఆచారం. నాయుడి వంశీకులు పూర్వం జమీందార్లుగా ఉండే వారని, ఆ కాలంనుంచీ కూడా ఈ ఆచారం వస్తూనేవుందని చెప్పుకుంటారు. అలా బసివిని చేసింతర్వాత ఆమెకాచీరను చుట్టించి కన్నెరికం చేసి, ఆమెతో మొదట కలిసేది ఆ వంశీకులే. కాబట్టి పసుపు రంగు చీరను పంపిచాడు నాయుడు. దాన్ని ఆమె వంటికి చుట్టారు. ఆమె చేతిలో పసుపుతాడు చుట్టిన కొబ్బరి బోండాం వున్న గంగాళం తట్టనుంచి, తల్లిదండ్రుల చేత దీవింపచేసారు.

చెంచయ్య అతని భార్య ఏమీచేయలేక నిస్సహాయంగా అతంతు చూస్తూ వుండిపోయారు.

డప్పులు, వర్ధి పలకలనబడే దుముకులు వాయిస్తూ, ఊరేగింపుగా ఆమెను మాతమ్మగుడిదగ్గరకు తీసుకువెళ్ళారు. ఊరిజనమంతా పెద్దకోలాహలంచేశారు. ఆవేళ, అలనాడు కౌరవసభలో ఏకవస్త్రగా నిలచిన ద్రౌపదిలా నిస్సహాయంగా కనిపిస్తోంది మాతంగి. వారి ఉప్పుతెగనాయకుడయిన ఉప్పుతోళ్ళరాముడు ఆ ఆ తంతంతా నిర్వహిస్తున్నాడు. ఒక స్త్రీని, మరో స్త్రీబొమ్మకిచ్చి పెళ్ళిచేసే నికృష్ట ఆచారానికి ఆ పల్లెలోని తెగలు, ఎక్కువ తక్కువలు ఏవీ అడ్డురాలేదు. గూడెంలోని ప్రజలంతా కలిసి కట్టుగా పవిత్రభావంతో, ఎంతో భక్తి శ్రద్ధలతో ఆతంతు నిర్వహిస్తున్నారు. కాదనే ధైర్యంలేక మాతంగి తల్లిదండ్రులు కుమిలి కుమిలి ఏడుస్తున్నారు.

"ఈదినంనుంచీ.....ఈ ఉప్పుతోలోళ్ళ ఆడబిడ్డను మాతమ్మను జేస్తావుండాం. యింగమీదట ఈయమ్మ ఆ దేవత మాతమ్మ పరమైపోయింది. ఈయమ్మను ఆయమ్మకిచ్చి పెండ్లిజేసి ముద్దరేసి వదిలేసే దానికి శెలవా?'
'

అని గొంతెత్తి అరుస్తూ, అందరి అంగీకారాన్ని కోరాడు ఉప్పుతోళ్ళ రాముడు.

"సాఁవిశెలవ!"

అంగికరిస్తున్నట్లుగా అందరూ ఏక కంఠంగా అన్నారు.

అలా మూడుసార్లు అందర్నీ 'సామిశెలవ' అడిగి పసుపు తాడును రంగసాని చేత ఆమె మెడలో కట్టించాడు.

అలా మాతంగిని బసివిగా మార్చేసిన శుభసందర్భంగా ఆ గూడెమంతా అక్కడే మాంసంతిని, కళ్ళుతాగి, డప్పులమధ్య చిందులేస్తూ గొప్పవేడుక చేసుకున్నారు. అమ్మవారికి కల్లు ముంతలు, మాంసపు ముక్కలు నైవేద్యం పెట్టారు: ఆ తర్వాత మాతంగి చేత కల్లు తాపించి, ఆమె నడుముకు వేపమండలు చుట్టి డప్పులమధ్య ఎగిరించారు. ఆమెతో బాటుగా అడుగులు వేసి శివమెత్తినట్లు ఆడి ఆనందించారు. అలా ఆమెను బసివిని చేసింతర్వాత ఊరి చివర ఆమె కొసమే నిర్మించిన గుడిసెలో ఆ రాత్రి ఆమెను ఒంటరిగా వదిలేసి అందరూ తమతమ ఇళ్ళకు చేరుకున్నారు.

ఇక ఆరోజునుంచీ ఆమె పనీపాటా చేసుకుంటూ స్వయంగా బతకాల్సిందే. పుట్టింటికిపోయినా, మరోయింటికి పోయినా, పొద్దుగూకిన వెంటనే గుడిసెకి తిరిగిరావాల్సిందే. ఆమెకు సంబంధించిన వస్తువులన్నీ ఆ గుడిసెలో ఉంచుకొని భద్రపరచుకోవాల్సిందే. ఆమె ఉన్నన్నిరోజులూ ఆ గుడిసె ఆమెదే. అక్కడే ఆమె జీవనం.

అయితే మొదట కన్నెరికం చేయాల్సింది పసుపు చీరపంపించిన నాయుడే. అందుకని రంగసాని ద్వారా నాయుడికి వర్తమానం అందించబడింది. అలా ఆమెపైన

పగసాధించుకొని తన పంతం నెగ్గించుకున్నాడు. పైగా ఆమెను ఆ రాత్రే అందరి అంగీకారంతో పొందుతున్నందుకు లోలోపలే ఆనందపడిపోయాడు. ఆమె బతుకును కుక్కలు చింపిన విస్తరిలా చేసే నాటకంలోని ప్రథమాంకంలో ముందస్తుగా తానే నాందీ ప్రస్తావన నిర్వహించబోతున్నందుకు పొంగిపోయాడు. ఇకనుంచీ ఆమెను తన ఒక్కడి సొంతమే చేసుకోవాలనుకున్నాడు. ఆమె కౌగిట్లో తను సుఖించబోయే ఘడియలకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. ఆ రాత్రి పల్లె సద్దుమణిగి చీకటి పిశాచికౌగిట్లో స్పృహ తప్పిపడివున్న ముని కన్యలా స్తబ్దుగావుంది.

వర్తమానం అందగానే బాగా ముస్తాబై పీకలదాకా తాగి ఆమెగుడిసెను సమీపించాడు నాయుడు.

అప్పటికే పల్లె నిశ్శబ్దంగా నిద్రపోతోంది. ఎక్కడా దీపాల వెలుతురనేదే లేదు. దానికి మించి మనుషుల నడేలేదు.

మెల్లగా వెళ్ళి తలుపుతట్టాడు:

"ఏయ్ మాతంగీ! తలుపు తియ్యే నీయబ్బడాలా!'

తలుపు తెరచుకోలేదు. దాంతో రెచ్చిపోయాడు నాయుడు. "ఒసే బసివిముండా! నన్నేకాదంటావా! చెంప దెబ్బకొడతావా? నేను జెప్పినట్లు ముందే యినుకోనుంటే.......ఇప్పుడు నీకీగతి పట్టేది కాదుగదా. యివ్వాదు నూరోజీవితాంతం బసివిముండగా బదకాల్సిందే. హాఁ లమ్మిడీ! నాతో పెట్టుకుంటావ్? అయ్! తియ్యే తలుపు."

మత్తులో నత్తినత్తిగా మాట్లాడుతూ ఎగిరితలుపు తన్నాడు. ఆ వేళ......ఆమెను పొందడం తనకున్న ఏకైక అధికారంగా భావించి ఎగిరెగిరి పడ్డాడు. నిక్కినీల్గాడు. అశ్లీలంగా నోటికొచ్చినట్లు తిట్టాడు. గతంలో ఎందరి అమ్మాయిల్ని చెడగొట్టిందీ చెప్పాడు. ఏ కన్నెపిల్లకు ఎలా మోసం చేసిందీ చెప్పాడు. బెదిరించాడు. పెద్ద వీరంగం వేశాడు. దాంతో మెల్లగా తలుపు తెరచుకుంది.

ఆ గుడిసెలో......ఓ మూల గోడకున్న దీగూట్లో, సన్నగా కిరసనాయల్ బుడ్డీ వెలుగుతోంది. ఆ వెలుగులో.....గోడవైపుకు తిరిగి నిలబడివున్న ఆమె అస్పష్టంగా కనిపిస్తోంది. అంతమసక చీకట్లోనూ తాను పంపిన పసుపు చీరలో ఆమె మరింత అందంగా, కొత్త పెళ్ళి కూతురిలా కనిపించిందతనికి. దాంతో అతని ఆవేశం కాస్త తగ్గి, అనునయంగా మాట్లాడసాగాడు.

"ఏదయితే అయిందిగానీ..... యింకనువ్వే నాకు సొంతం నీపైన ఈగె వాలనియ్యను. దా.....నన్ను సుఖపెట్టు.......' 'అంటూ లోపలికి అడుగుపెట్టి, వెనుకనుంచే, ఆమె భుజాలు స్పృశించసాగాడు.

ఆమె అలాగే మౌనంగా నిలబడివుంది.

"ఏయ్ యింకా ఎందుకే సిగ్గు......భయమా! ఏంభయంవులే....ఇంక నిన్ను నేను పరమనెంటుగా పెట్టుకుంటాలే. దా......దా......" అంటూ తన్మయత్వంతో ఆమెను ఒక్కసారిగా తనవైపుకు తిప్పుకున్నాడు.

అంతే!!

నిశ్చేష్టుడై అలాగే నిలబడిపోయాడు!

ఒక్కసారిగా అతని నవనాడులూ స్తంభించిపోయాయి. అంతకి ముందు వరకూ అతనిలో వున్న తన్మయత్వం, కోరికా, ఆవేశం, కోపం అన్నీ ఎవరో చేయిపెట్టి ఒక్క క్షణంలో అలా పైకి లాగేసినట్టు ఒక్కసారిగా దిగిపోయినట్టు అనిపించింది. తాగినమత్తంతా ఒక దెబ్బతో దిగిపోయింది. అక్కడున్నది మాతంగి కాదు!

స్వయాన తన రక్తం పంచుకుని పుట్టిన తన కూతురు త్రిపురసుందరి!!

తండ్రి ........తన పథకాన్ని రంగసానికి చెబుతుండగా విన్న ఆ రెండు చెవులూ ఆమెవే. తన తండ్రి దుర్మార్గాన్ని అప్పుడే తెలుసుకుంది ఆమె. ఎలాయినా సరే తన తండ్రికి బుద్ధిచెప్పి, అతని అన్యాయాలకు అడ్డుకట్టవేసి, అతని పాపాలకు ప్రాయశ్చిత్తంగా తన స్నేహితురాలిని కాపాడాలని, తద్వారా మొత్తం గూడాన్నే తండ్రిబారి నుండి రక్షించాలని అనుకుంది.

ఆరాత్రివేళ అతనికంటే ముందే అక్కడికి వచ్చి మాతంగికి ధైర్యం చెప్పి వప్పించి జయరాముడితో జతచేసి ఊరువదిలి వెళ్ళిపోయేటట్లుగా చేసింది.

"యెక్కడికి వెళ్ళినా మీకష్టం మీకు తప్పదు. ఇక్కడకష్టమే ఇంకెక్కడ జేసినా బతికిపోవచ్చు. దూరంగా వెళ్ళిపోయి ఈ ఆచారాలు, తెగలు మరచిపోయి హాయిగా బతకండి...."అని హితవుచెప్పి, వారికి కావాల్సిన డబ్బులు, తన నగలు కూడా యిచ్చి పంపించేసింది.

వెళ్ళేటప్పుడు తన చీర ఆమెకిచ్చి, ఆమెకట్టుకున్న చీరను తను చుట్టుకొని ఆ గుడిసెలో తండ్రి రాక కోసమే ఎదురుచూస్తోంది.

ఈ విషయం తెలియని రంగనాయుడు అక్కడివచ్చి, ఆ స్థితిలో ఆమెనుచూసి, అక్కడే నేలపైన కుప్పగా కూలి పోయాడు.

